


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 128 ఆదివారం 11-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 7 వెల : 5 రూ/..

## ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదు..

### దృఢంగా వ్యవహరిస్తాం: జైశంకర్



న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన కాల్పుల విరమణను ఆయన ప్రస్తావించారు. అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి భారత్, పాకిస్థాన్ ఒక అవగాహనకు వచ్చాయని ఎస్ జైశంకర్ తెలిపారు. అలాగే ఉగ్రవాదంపై వైఖరికి భారత్ రాజీపడబోదని అన్నారు. 'భారత్, పాకిస్థాన్ దేశాలు కాల్పుల విమరణ, సైనిక చర్యపై ఒక అవగాహన కుదుర్చుకున్నాయి. అన్ని రూపాలు, వ్యక్తీకరణలలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన, రాజీలేని వైఖరిని భారత్ నిరంతరం కొనసాగిస్తుంది. ఇది అలాగే కొనసాగుతుంది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక చర్యల వల్ల గత కొన్ని రోజులుగా భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. అయితే పాక్ మిలిటరీ సంప్రదింపుల కారణంగా కాల్పుల విరమణకు భారత్ అంగీకరించిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని వెల్లడించారు.

# విరమణ ఉల్లంఘన

- కాల్పుల విరమణకు భారత్, పాక్ ఓకే.. ఒప్పందం కుదిరిన గంటల్లోనే పాక్ ఉల్లంఘన
- రాత్రంతా జరిపిన చర్చలు ఫలించాయి: ట్రంప్
- వెంటనే, పాక్ విదేశాంగ మంత్రి దార్ సమర్థన
- విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని పోస్టు
- పాక్ దిగి వచ్చింది.. ఆ దేశ డీజీఎంవో ఫోన్ చేశారు
- మన డీజీఎంవో అంగీకారం.. మళ్లీ రేపు ఇరు దేశాల డీజీఎంవోల భేటీ: విక్రమ్ మిస్రి
- సింధు నిలిపివేత, వీసా ఆంక్షలు కొనసాగుతాయి
- భారత్‌పై ఉగ్ర దాడులను యుద్ధంగా పరిగణిస్తాం
- మన షరతుల ప్రకారమే విరమణ ఉండాలన్న మోదీ
- ఆ తర్వాత 4 గంటలకే పాక్ సైన్యం ఉల్లంఘన
- డ్రోన్లతో దాడి.. బీఎస్ఎఫ్ ఎస్సై వీర మరణం



న్యూఢిల్లీ, మే 10: కొన్ని గంటల్లోనే.. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. శ్రీనగర్‌లో భారీ పేలుళ్లు వినిపిస్తున్నాయి. ఉధంపూర్, బారాముల్లా, ఆర్ఎస్ పుర తదితర సెక్టార్లలోని భారత సైనిక పోస్టులపై పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది! శ్రీనగర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, ఉధంపూర్, బార్మర్ తదితర ప్రాంతాల్లో యథావిధిగా చిమ్మ చీకట్లు నెలకొన్నాయి! పంజాబ్ గురుద్వారా సమీపంలో పేలుళ్లు! ఆర్ఎస్ పురలో పాక్ కాల్పులకు బీఎసఎఫ్ ఎస్సై ఇంతియాజ్ వీర మరణం పొందారు. పాక్ నిరంతరాయంగా ప్రయోగిస్తున్న డ్రోన్లను భారత్ అడ్డుకుని పేల్చేస్తుండడంతో ఇరు దేశాల సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవిస్తున్నాయి. అక్కడి ప్రజల సంతోషం కొన్ని గంటలపాటు కూడా నిలవలేదు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందన్న ఊరట వారికి దక్కలేదు. నిజానికి, మూడు రోజులపాటు భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగిన ఉద్రిక్తతలకు శనివారం సాయంత్రం తాత్కాలికంగా తెరపడింది. రాత్రంతా చర్చలు జరిపామని, ఇరు దేశాలూ తక్షణ, పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్టు పెట్టారు. ఆ తర్వాత కొద్ది సేపటికే పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈషాక్ దార్ స్పందించారు. తక్షణమే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించాయని ప్రకటించారు. తన సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడకుండా ఈ ప్రాంతంలో శాంతి, భద్రతలు కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తుందని కూడా తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అంటే శనివారం సాయంత్రం ఆరు గంటలకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఎప్పట్లాగే విలేకరుల ముందుకు వచ్చారు. "పాకిస్థాన్ దిగి వచ్చింది. ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) మధ్యాహ్నం 3.30 గంటలకు భారత డీజీఎంవోతో చర్చలు జరిపారు. పూర్తిస్థాయిలో కాల్పులతోపాటు భూమ్మీద, ఆకాశంలోనూ, సముద్రంలోనూ సైనిక చర్యలను సాయంత్రం ఐదు గంటల నుంచి నిలిపివేయాలని ఇద్దరూ నిర్ణయించారు" అని ప్రకటించారు. ఈ ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని ఇరు వర్గాలకూ సూచించామని, డీజీఎంవోలు ఇద్దరి మధ్య ఈనెల 12వ తేదీన మళ్లీ చర్చలు జరుగుతాయని తెలిపారు. తొలుత, పాకిస్థాన్ డీజీఎంవో చొరవ చూపారని, మధ్యాహ్నం 3.35 గంటలకు ఆయనే ఫోన్ చేశారని, ఆ తర్వాత చర్చలు జరిగి ఒప్పందం కుదిరిందని వివరించారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ కూడా ప్రకటించారు. "కాల్పులు, సైనిక చర్య నిలిపివేతకు భారత్, పాకిస్థాన్ ఓ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

## భారత సైన్యం పోరాటం అద్భుతం : హరీశ్‌రావు



సిద్దిపేట, మే 10 : పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను ఏరి వేయడానికి భారత సైన్యం అద్భుతంగా పోరాటం చేస్తోంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశంసించారు. పహల్గాంలో అమాయకులైన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం కలిచివేసిందన్నారు. సిద్దిపేటలో శ్రీశ్రీశ్రీ దుర్గా ప్రసాద్ స్వామి వారి ఆధ్వర్యంలో శ్రీ సంతోషిమాత దేవాలయంలో 108 హోమ కుండాలతో హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ హోమంలో పాల్గొన్న భక్తులందరికీ పేరుపేరునా నమస్కారం. దుర్గాప్రసాద్ స్వామీజీ చేతుల మీదుగా ఈ హోమం సిద్దిపేటలో జరగడం చాలా సంతోషంగా ఉంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, భారతదేశంలో శాంతి నెలకొలపాలని దుర్గాప్రసాద్ స్వామీజీ ఆశీస్సులతో చేసే ఈ హోమం ఫలించాలని కోరు కుంటున్నాను. తెలంగాణ రాష్ట్రం సుఖ సంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను. మన సైనికులకు బలాన్ని అందించి, ఉగ్రవాదులపై విజయం సాధించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణలో ఈ భక్తి కార్యక్రమం మొట్టమొదటగా సిద్దిపేటలో ప్రారంభించడం జరిగిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా యువతను భక్తి మార్గంలో నడిపించదానికి, సక్రమంగా క్రమశిక్షణతో నడిచేందుకు ఈ హనుమాన్ దీక్ష ఉపయోగపడుతోంది. కొంతమంది యువత దీక్ష పట్టిన సమయంలో మండుతున్న ఎండలో చెప్పులు లేకుండా తిరుగుతుంటారు.వారు భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు.

## రాబోయే మూడు రోజుల్లో తెలంగాణలో మోస్తరు వర్షాలు..!

హైదరాబాద్, మే 10 : తెలంగాణలోని పలు జిల్లాల్లో మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఇవాళ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలుతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.



## ఆపరేషన్ కగార్.. సీఆర్‌పీఎఫ్ బలగాలు వెనక్కి



ఢిల్లీ: మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ పై ఆపరేషన్ సిందూర్ ప్రభావం పడింది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల కోసం కర్రెగుట్టలను జల్లడపడుతున్న సీఆర్‌పీఎఫ్ బలగాలను కేంద్ర హోంశాఖ దశలవారీగా వెనక్కి రప్పిస్తున్నది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి పిలిపిస్తున్నది. ఇందులో భాగంగా తెలంగాణ -ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లు తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం, పాముసూరు పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలు వెనక్కి మళుతున్నాయి. ఆదివారం ఉదయం లోపు వీరంతా సరిహద్దుల్లోకి వెళ్లనున్నారు. అయితే ఛత్తీసగఢ్ వైపు ఆపరేషన్ కగార్ యథావిధిగా కొనసాగుతుందని ప్రకటించింది.

# తారలు దిగి వచ్చిన వేళ

- వైభవంగా మిస్ వరల్డ్ పోటీల ప్రారంభం.. పాల్గొన్న 110 దేశాల సుందరీమణులు
- భారత్ తరఫున నందినీ గుప్తా ప్రాతినిధ్యం.. వేడుకల్లో ఉట్టిపడిన తెలంగాణ సంస్కృతి
- అత్యంత పటిష్ఠమైన భద్రత మధ్య పోటీలు.. ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





హైదరాబాద్, మే 10: దివిలో ఉండే తారలంతా భువికి దిగి వస్తే! అందులోనూ హైదరాబాద్‌కు వస్తే!! శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్-2025 పోటీల ప్రారంభ కార్యక్రమం సరిగ్గా అలాగే కనిపించింది. 110 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్న ఈ పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దాదాపు రెండున్నర గంటలపాటు ఈ కార్యక్రమం జరిగింది. ఈ పోటీలతో.. ఉద్యమగడ్డ తెలంగాణపై ప్రపంచ దేశాలన్నీ సాక్షాత్కరించాయి. ఆయా దేశాల జెండాలతో వారంతా కలిసి ఒకేసారి ర్యాంపుపైకి రాగా.. భారత్ తరపున మిస్ ఇండియా నందినీ గుప్తా జాతీయ జెండాతో అందరికీ అభివాదం చేశారు. ఆ ఘట్టం ఉద్విగ్నభరితంగా సాగింది. పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. ప్రపంచ దేశాలు పాల్గొనే మిస్ వరల్డ్ పోటీల్లో భారతదేశ జెండా కనబడగానే "భారత్ మాతాకీ జై" అనే నినాదంతో స్టేడియం మార్మోగింది. తెలంగాణ గేయంతో ప్రారంభమైన 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ కార్యక్రమం.. జాతీయగీతం జనగణమనతోపాటు అంతకుముందు మిస్‌వరల్డ్ గీతం ఆలాపనతో ముగిశాయి. మరోవైపు అందాలబామల ప్రదర్శన మధ్యలో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, వాటి ఔన్నత్యం తదితర అంశాలతో కూడిన కొన్ని వీడియో సందేశాలను ప్రదర్శించారు.

### ఆకట్టుకున్న పేరిణి నృత్యం..

మిస్ వరల్డ్-2025 పోటీల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, పాశ్చాత్య దేశాలకు చెందిన కొన్ని కళలను కూడా ప్రదర్శించారు. పలువురు కళాకారులతో తెలంగాణ రాష్ట్ర గేయం ఆలాపనతో కార్యక్రమం ప్రారంభం కాగా, ఆ తరువాత 250 మందితో ప్రదర్శించిన పేరిణి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ప్రదర్శించిన గుస్సాడి నృత్యం అలరించింది. తెలంగాణకు ప్రత్యేకమైన కొమ్ము నృత్యం ఆహుతులను ఎంతగానో ఆకర్షించింది. ఇక లంబాడ కళాకారుల డప్పు నృత్యం, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ప్రదర్శన మధ్యలో కొంతమంది కళాకారులు పిరమిడ్ ఆకారంలోకి వచ్చి పైన నిల్చున్న వ్యక్తి జాతీయజెండాను చేతబూని అద్భుత ప్రదర్శన చేశారు. జాతీయ జెండా కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకులంతా 'జై భారత్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు మిస్‌వరల్డ్ పోటీల ప్రారంభ సమావేశంలో లాటిన్ అమెరికా దేశాల పోటీదారులు తమ ఆహార్యంతోపాటు ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా ఖండాల వారీగా ప్రదర్శన నిర్వహించారు.



# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

## గార్ల మండల కేంద్రంలో రాజకీయ పార్టీల ప్రజాసంఘాల శాంతి ర్యాలీ




**తొలి సమయం మహబూబాబాద్ మే 10 :**
మధ్యభారతంలో ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన మారణకాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వివిధ పార్టీల, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం నాడు గార్ల మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీ నెహ్రూ సెంటర్లో ప్రారంభించి డోర్నకల్ రోడ్డు మెయిన్ రోడ్ జై మందిర్ పోస్ట్ ఆఫీస్ రోడ్ ప్రధాన రహదారుల గుండా ఈ ర్యాలీని నిర్వహించడం జరిగింది. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఈ ర్యాలీని ఉద్దేశించి అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారును ఆపాలని, ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో నెలకొని ఉన్న సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని దండకారణ్యంలో అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్రేగుట్టల నుండి సైనిక బలగాలను వెంటనే ఉపసంహరించాలని, మధ్య భారతంలో దండకారణ్యంలో శాంతిని నెలకొల్పాలని, ఆదివాసులను అడవులను కాపాడాలని ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గుగులోత్ సక్రు బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, బిఆర్ఎస్ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు కందునూరి ఈశ్వర్ లింగం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు హరినాయక్ వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు మాలోత్ మాన్య నాయక్, కత్తి బాలరాజు, వల్లపుదాసు వెంకటేశ్వర్లు, ఎస్.కె యాకుబ్ పాషా, మాగం లోకేష్, అంకెపాక కిరణ్, కే.రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జల సాధన సమితి చైర్మన్‌గా విశ్వ జంపాల ఎంపిక..



**తొలి సమయం మహబూబాబాద్ మే 10 :**
గోదావరి జలాలను ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు అందించాలనే డిమాండ్ తో ఆవిర్భవించిన గోదావరి జల సాధన సమితి చైర్మన్ గా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల, కన్వీనర్ గా బిఆర్ఎస్ నాయకులు పానుగంటి రాధాకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నాడు తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో జరిగిన గోదావరి జలసాధన సమితి (సీతారామ ప్రాజెక్టు న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గోదావరి జల సాధన సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ లుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందునూరి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకట రెడ్డి, టిఆర్ఎస్ జిల్లా నాయకులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, టిడిపి రైతు నాయకులు కత్తి సత్యం, బిజెపి రాష్ట్ర నాయకులు రాహుక విమల్ కుమార్ జైన్ కో- కన్వీనర్లుగా సిపిఎం నాయకురాలు అలువాల సత్యవతి, సిపిఐ నాయకులు జంపాల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గూగులోత్ సక్రు, టిడిపి నాయకులు రంగరాజు శివాజీ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్య హరి నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ కే యాకూబ్ పాషా, తెలంగాణ జన సమితి నాయకులు ఎడ్ల రాజేందర్, డిఎస్ఎఫ్ఐ నాయకులు శాంతి కుమార్, నక్క శివకృష్ణ కార్యవర్గ సభ్యులుగా గడిపాటి రాజారావు, మాలోత్ మాన్య నాయక్, చిలక నరసయ్య, మట్లపల్లి వీరభద్రం, కత్తి బాలరాజు, సిరపంగి నాగేశ్వరరావు, సంగిశెట్టి ప్రభాకర్ రాగం రమేష్, సిహెచ్ గణేష్, మాగం లోకేష్, అంకె పాక కిరణ్ కుమార్, గుగులోత్ దేవా మీడియా కన్వీనర్ లుగా కందునూరి ఈశ్వర్ లింగం, వజ్రం నాగేశ్వరరావు, వల్లపుదాసు వెంకటేశ్వర్లను ఈ సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీలున్నంత త్వరలో ఈ కమిటీని విస్తృత పరుస్తూ మరి కొంతమందిని వైస్ చైర్మన్ లుగా, కో కన్వీనర్ లుగా, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోనున్నట్లు చైర్మన్ విశ్వ తెలిపారు

**గోదావరి జలసాధన సమితి ఆవిర్భావ సదస్సు తీర్మానాలు**

1. ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం మానుకోట జిల్లాల ఉమ్మడి సరిహద్దుగా ఉన్న ఏజెన్సీగిరిజన ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను అందించాలి
2. సీతారామ ప్రాజెక్ట్ మొదటి డిపిఆర్ ను అమలు చేయాలి
3. సీతారామ ప్రాజెక్ట్ లో జరిగిన అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి
4. ఇటీవల గార్ల డోర్నకల్ మధ్యలో సీతారామ ప్రాజెక్ట్ కాలువలో పడి చనిపోయిన భార్య సభావత్ విజయ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్త సభావాత్ బౌసింగ్ లకు 50 లక్షలు రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి

# గోదావరి జల సాధన కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం

**- సీతారామ ప్రాజెక్ట్ పై న్యాయ పోరాటం చేస్తాం - గోదావరి జల సాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల**





**తొలి సమయం, మహబూబాబాద్ మే 10:**
గోదావరి జల సాధన సమితి (సీతారామ ప్రాజెక్ట్ న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సభలో వెల్లడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఉమ్మడి సరిహద్దు ఏజెన్సీ గిరిజన ప్రాంతాల బీడు భూములకు గోదావరి జలాలు సాధించేందుకు ప్రాణ త్యాగానికైనా సిద్ధమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోదావరి జలసాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల వెల్లడించారు. శనివారం నాడు గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల అధ్యక్షతన తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గోదావరి జల సాధన సమితి (సీతారామ ప్రాజెక్ట్ న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ ఆవిర్భావ సదస్సులో విశ్వ మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు సాగు, త్రాగు నీరు అందించడంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడితే ఏజెన్సీ ప్రజల సాగు త్రాగునీటి అవసరాలు తీరుతాయని ఏజెన్సీ ఆదివాసి గిరిజన ప్రజలు ఎంతో విశ్వాసంతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత 2016లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రోళ్ళపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు త్రాగు నీరు అందిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఆ తర్వాత కొందరి రాజకీయ అవసరాల కోసం సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ బలి పశువుగా మారిందని విశ్వ ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రీడిజైన్, రీఇంజనీరింగ్, రీఎస్టిమేషన్ అంతా ఒక కుట్రపూరిత చర్యని, ఈ ప్రాజెక్టు అవినీతి అక్రమాలకు నెలవుగా మారిందని ఆరోపించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం సరైనది కాదని ఆయన పేర్కొంటూ ఆ తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు గోదావరి జల సాధన కోసమే గోదావరి జలసాధన సమితి ఏర్పాటు చేసిన్నట్లు ఆయన వెల్లడించారు. సీతారామ ప్రాజెక్ట్ బాధిత ప్రాంతాలలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి ప్రజా ఉద్యమం తో పాటు న్యాయపోరాటం చేస్తామని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాల కోసమే సీతారామ ప్రాజెక్టు ను దారి మళ్ళించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతాలు సాగు తాగునీరు లేక తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటుంటే రెండు పంటలు పండుతున్న నాగార్జునసాగర్ ఆయకట్టుకు సీతారామ ప్రాజెక్టు నీళ్లను మళ్ళించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు గోదావరి జలాలు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గుగులోత్ సక్రు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ మొదటి డిపిఆర్ అమలు చేస్తూ ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు త్రాగు సాగు నీళ్లు ఇవ్వాలని అన్నారు. టిఆర్ఎస్ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ లో జరుగుతున్న అక్రమ నీళ్ల తరలింపు పై, అవినీతి అక్రమాలపై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ గంగావతి లక్ష్మణ్ నాయక్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు కందునూరి ఈశ్వర్ లింగం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు హరినాయక్ వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు మాలోత్ మాన్య నాయక్, కత్తి బాలరాజు, వల్లపుదాసు వెంకటేశ్వర్లు, ఎస్.కె యాకుబ్ పాషా, మాగం లోకేష్, అంకెపాక కిరణ్, కే.రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి

**తొర్రూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ**




**తొలి సమయం తొర్రూరు మే 10**
తొర్రూరు పట్టణమునందు మురళి నాయక్ అయినా గిరిజన ముద్దు బిడ్డ "మురళి నాయక్ ఘనంగా నివాళి అర్పించిన తొర్రూర్ టిఆర్ఎస్ నాయకులు మరియు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వర్షంలోనూ భారత్ జవాన్ అయినా గిరిజన ముద్దు బిడ్డ "మురళి నాయక్ "కి ఘనంగా నివాళి అర్పించిన తొర్రూర్ నాయకులు మరియు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.. జననీరాజనం జై జవాన్ జై జవాన్ అంటూ నినాదాలు చేస్తూ భౌతికకాయం వెంట ముందుకు సాగుతున్న జనం వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ పార్థివదేహాన్ని బెంగళూరు నుంచి కల్లితండాకు తీసుకొస్తుండగా.. రోడ్డు పొడవునా జననీరాజనం ఒకవైపు వర్షం పడుతున్నా లెక్కచేయకుండా తండోపతండాలుగా తరలివస్తున్న ప్రజలు రేపు వీర జవాను మురళీ నాయక్‌కు అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు

## పాకిస్తాన్ కవ్వింపు చర్యలను నిరసిస్తూ... ఇల్లందులో జర్నలిస్టుల ప్రదర్శన



**తొలిసమయం, ఇల్లందు. మే,10**
ఇల్లందు పట్టణంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పెహల్గాం లో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ... ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్తాన్లో ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా భారత్ వ్యవహరిస్తే పాకిస్తాన్ తన కుటిల బుద్ధితో దేశంలోని పలు రాష్ట్రాల్లో కీలక ప్రాంతాల్లో డ్రోన్లతో కవింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. పాకిస్తాన్ తీరును నిరసిస్తూ నినాదాలు చేస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టుల ర్యాలీకి సిఐ బత్తుల సత్యనారాయణ పోలీసులు సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్ ఉగ్ర దాడిలో అమరులైన భారత జవాన్లకు, మృతుల ఆత్మకు శాంతి కలగాలంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్‌కుట్ర తీరును ప్రపంచ దేశాలు గుర్తించాలన్నారు.

### సిహెచ్‌పి మ్యాన్ పవర్ పెంచాలని

## ఎఐటియుసి వినతిపత్రం అందజేత

**తొలిసమయం, ఇల్లందు. మే,10**




ఇల్లందు:ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో శనివారం సిహెచ్పి సమస్యలు పరిష్కరించాలని సిహెచ్పి ఇంచార్జి డివైజీఎం క్రీస్టఫర్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సిహెచ్పి లో జనరల్ అసిస్టెంట్ ల కొరత వుందని అదేవిధంగా క్లర్క్ స్టాఫ్ కూడా తక్కువగా ఉన్నారని అన్నారు ప్రతిరోజూ రెండు రేకులు బొగ్గు రవాణా జరుగుతుంది జనరల్ అసిస్టెంట్ ల కొరత వల్ల రెక్ చెకింగ్ మరియు డంపింగ్ లో చాల ఇబ్బందులు ఎదురవ్వతున్నది మరియు క్లర్క్ ల కొరత వల్ల కూడా వేబ్రిడ్జీలలో జనరల్ అసిస్టెంట్ లను పెట్టి విధులు నిర్వహిస్తున్నారు మ్యాన్ పవర్ కొరతవల్ల ఎదురై ఇబ్బందులు నివారించాలని వివిధ విభాగాల స్టాఫ్ ను భర్తీ చేయాలని వారు యాజమాన్యం ను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిహెచ్పి పిట్ సహాయ కార్యదర్శి మహ్మద్ యాకూబ్, వజ్రాల అప్పిరెడ్డి, సంతోష్ కుమార్, కుమార్, రాజలింగం, కుమారి, పద్మా తదితరులు పాల్గొన్నారు.

## జగదాంబ గుంపులో వే బ్రిడ్జి ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్ మెట్టల కృష్ణ

**బరువు,తూకాల సమస్య పోయింది అంటున్న వినియోగదారులు**

**తొలిసమయం, ఇల్లందు. మే,10**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం జగదాంబ గుంపులో శుక్రవారం నూతనంగా జైశ్రీరామ్ అనే వే బ్రిడ్జి ని జక్కుల శ్రీనివాస్ నెలకొల్పగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిఏసిఎస్ చైర్మన్ మెట్టల కృష్ణ హాజరై,వేదమంత్రాల పురోహితుల మధ్య, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చుట్టుపక్కల గ్రామాల రైతులకు అందుబాటులో వే బ్రిడ్జి ఉండటం సంతోషకరమని అన్నారు. స్థానికంగా వే బ్రిడ్జి లేకపోవడంతో బరువులు చూడాలంటే చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని కొందరు వాపోయారు, రైతులు తమ పంటను స్థానికంగానే బరువులు చూసుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల వెంకన్న, శ్రీను, మెట్టల వీరస్వామి, ధనకొండ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి శిబిరంలో డఫోడిల్స్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**శిక్షణలో అద్భుతంగా రాణించినా 33 విద్యార్థులు**
**విద్యార్థులకు అభినందించిన పాఠశాల కరస్పాండెంట్**
**క్రమశిక్షణకు మారుపేరు ఎన్ సీ సీ**
**డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్**






**తొలిసమయం నర్సంపేట మే 10**
క్రమశిక్షణకు మారుపేరు ఎన్ సీ సీ అని డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అన్నారు. వరంగల్ గ్రీన్ వుడ్ హై స్కూల్ హసన్ పర్తి లో మే 1 నుంచి 10 వరకు ఏర్పాటు చేసిన 10తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏ టి సి- 1 ఎన్సీసీ శిక్షణా శిబిరంలో జేడీ %-% 19, జే డబ్ల్యూ %-% 14 మొత్తం 33 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడమే కాక, శిక్షణలోనూ అద్భుతంగా రాణించారు.ఈ క్యాంప్‌లో విద్యార్థిని బీ. వర్షిత రెండు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఉత్తమ డ్రిల్ మరియు ఉత్తమ ప్రదర్శకురాలి అవార్డులను పొంది డఫోడిల్స్ పాఠశాల ప్రతిభను చాటి చెప్పారు ఈ సందర్భంగా శనివారం నర్సంపేట లోని డఫోడిల్స్ (సి.బి.యస్.ఈ) పాఠశాలలో కరస్పాండెంట్ చింతల నరెందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందనలు తెలిపి విద్యార్థులకు ప్రోత్సహించి అభినందన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి కరస్పాండెంట్ చింతల నరెందర్ మాట్లాడుతూ నేడు విద్యార్థులు పుస్తకాలకే పరిమితమవకుండా సమాజంలో బాధ్యతాయుతంగా, నాయకత్వంతో కూడిన పౌరులుగా ఎదగాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఎన్ సి సి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోంది. కేవలం విద్యకే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి ఎన్సీసీ బలమైన ఆధారంగా నిలుస్తోంది.ఎన్సీసీ ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి,నాయకత్వ లక్షణాలు సామాజిక సేవా భావన,శారీరక దారుఢ్యం పెంపొందించుకోవచన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్ , ప్రధానోపాద్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ రీటా,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి, శశికల,ఎన్ సి సి కేర్ టెకర్ వెంకటరత్నం, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ నాణ్యతపై అధికారుల తనిఖీలు

**తొలి సమయం వరంగల్ మే 10**
పాడైపోయిన, కుళ్ళిపోయిన పండ్లను మరియు కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడుతున్న బరిష్ట జ్యూస్ పై టాస్క్‌ఫోర్స్ కొరడ హన్మకొండ, బాలసముద్రం, ఏకశిలా పార్క్ సమీపంలోని బరిస్టా జ్యూస్ హౌస్ లో ఫుడ్ సేఫ్టీ నియమాలు పాటించకుండా, కుళ్ళిపోయిన, పాడైపోయిన పండ్లను వాడుతూ, ఎక్స్పైరీ అయిన ఆహార పదార్థాలను ఉపయోగిస్తూ జ్యూస్ తయారు చేస్తున్న,అమ్మకానికి సిద్ధంగా నిల్వచేసిన దాదాపు 19 రకాల, సుమారు 21,420 రూపాయల విలువ గల ఫ్రూట్ జ్యూస్ ఉత్పత్తులు స్వాధీనం వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ విషయంలో నాణ్యత,పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్న వ్యాపారస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలనే గట్టి నిర్ణయంతో వరంగల్ పోలీసు కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్ గారి ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఎ.సి.పి మధుసూదన్ గారి ఆద్వర్యం లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి . బాబులల్ గారు తన సిబ్బంది తో క్రిష్ణావు రాజేందర్ నడుపుతున్న బరిస్టా జ్యూస్ హౌస్ లో తయారీ మరియు డిస్ట్రిబ్యూషన్ షాపు లో వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి.బాబులాల్ మరియు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు సంయుక్తంగా దాడి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఫుడ్ సేఫ్టీ నియమాలు పాటించకుండా, కుళ్ళిపోయిన పండ్లు, ఎక్స్పైరీ అయిన ఆహార పదార్థాలను వాడుతూ తయారు చేసిన అమ్మకానికి సిద్ధంగా, పాడైన ఉన్న దాదాపు 19 రకాల సుమారు 21,420/- రూపాయల విలువ గల ఫ్రూట్ జ్యూస్ ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని షాప్ ఓనర్ క్రిష్ణావు రాజేందర్ తండ్రి జగదీశ్ యాదవ్, (37)యాదవ్, బిజినెస్ రెసిడెన్స్ ఆఫ్ హౌస్ నెంబర్ 1-8-336, బాలసముద్రం ,హన్మకొండ గారిని ప్రాపర్టీ తో పాటు తదుపరి చర్య నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారి గారికి అప్పగించడం జరిగింది.



**వ్యాపారస్తులకు పోలీస్ వారి హెచ్చరిక**
ఆహార భద్రత విషయంలో అపరిశుభ్రంగా,కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయించినా, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై చర్యలు తప్పవు, ప్రముఖ బ్రాండ్‌లను మార్పు చేసి విక్రయాలు చేస్తున్న నకిలీ వస్తువులపై నిఘా ఉంచాం. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006, 2011 రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం నిబంధనలు పాటించని ఫుడ్ సేఫ్టీ శాఖ సహాయంతో వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.ఇట్టి దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి.బాబులాల్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వేణు మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మీకోసం మేమున్నాం కమిటీ ఆర్థిక సాయం

**తొలి సమయం చర్ల మే 10**
చర్ల మండలంలో పేదవాడి ఆకలికి ఆర్థిక ఇబ్బందులని తమవంతుగా సాయం చేసేందుకు మేమున్నాం మీకోసం కమిటీ పని చేస్తున్న సంగతి మండలవాసులకు అందరికీ తెలిసినదే దీనిలో భాగంగా శనివారం లింగాపురం పాడు గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వరరావు గత కొంతకాలంగా హెర్నియా వ్యాధితో బాధపడుతున్నాడు అయితే హెర్నియా ఆపరేషన్ చేయించుకోవడం జరిగినది. ఈ ఆపరేషన్ తర్వాత వైద్యులు రెండు నెలల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని సూచించడం జరిగింది. రెక్కాడితేనేగాని డొక్కాడని ఆ కుటుంబం ఒక చిన్న బడ్డీలో వాచ్ మెకానిక్గా గత 25 సంవత్సరాలుగా ఆ చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్నాడు .వైద్యుల సూచన మేరకు రెండు నెలల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలంటే ఆర్థికంగా అతను చాలా ఇబ్బందులకి గురి అవ్వాల్సిన పరిస్థితి ఉన్నది . వారు వెంటనే మీకోసం మేమున్నాం కమిటీని సంప్రదించి ఆర్థిక సాయం చేయవలసిందిగా కోరడం జరిగింది దీనికి స్పందించిన మీకోసం మేమున్నాం కమిటీ వారు ఫండ్ రైజింగ్ పోస్ట్ ద్వారా ఆర్థిక సాయం కోరారు దానికి స్పందించిన చర్ల మండల వాసులు ఒక్కొక్కరుగా తమ స్తోమతను బట్టి ఆర్థిక సాయం చేయడం జరిగినది. ఆ మొత్తము 11,600 అయినవి వాటిని చర్ల మండలంలో శనివారం మీకోసం మేమున్నాం కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి తాతారావు చేతులు మీదుగా గుంజి వెంకటేశ్వరరావుకి అందజేయడం జరిగినది.ఈ సందర్భంగా మీకోసం మేమున్నాం కమిటీ చైర్మన్ డాక్టర్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ



ఆపదలో ఉన్న వారికి మనందరం తోచినంతగా సహాయం అందించాలని అలా అందించినట్లయితే వారి కష్టాలను మనం ఎంతో కొంత దూరం చేసిన వారు అవుతామని మీకోసం మేమున్నాము కమిటీ ఆ విధంగానే తమ వంతుగా ముందు సాయం చేస్తూ వెళుతుందని దీనికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు అని ఇక ముున్ముందు కూడా ఇలాగే సహకరించి పేదవారి కష్టాల్లో పాలుపంచుకోవాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో దొడ్డి తాతారావు, మీకోసం మేమున్నాం కమిటీ చైర్మన్ డాక్టర్ నీలి ప్రకాష్, కవ్వాల రాంబాబు ,దొడ్డిసూరిబాబు,బి వి ప్రతాప్,గాదెరాజు ప్రసాద్ ,దొడ్డి రామ్మోహన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో అవార్డుల సర్మనీ



**తొలి సమయం వరంగల్ మే 10**
తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం.ఏ. మజీద్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ మోహియోద్దీన్, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి గాను అవార్డుల సర్మనీ బషీర్ బాగ్ హైరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, కోశాధికారి మహమ్మద్ అమీర్, సలహాదారులు వహీద్ గుల్షన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా నుండి సీనియర్ జర్నలిస్ట్ వహీద్ గుల్షన్ గారిని రూ. 10,000 నగదు చెక్ మరియు అవార్డు సన్మానంతో ఘనంగా గౌరవించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ ఆలీ తదితరులు హాజరయ్యారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




**తొలి సమయం వరంగల్ మే 10**
వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, నల్లబెల్లి గ్రామాల్లో భూభారతి సదస్సు



**తొలి సమయం వరంగల్ మే 10**
వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, నల్లబెల్లి గ్రామాల భూభారతి సదస్సులకు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై భూ సమస్యలపై రైతులు చేసుకొన్న దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు.గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆన్నారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తహసీల్దార్ విజయసారధి, రెవెన్యూ అధికారులు. పాల్గొన్నారు. అనంతరం ల్యాబర్తి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పరిశీలించి సమర్ధ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## 50 కిలోల బియ్యం అందజేత

**ఎల్కతుర్తి మే 10 :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని టీజీ 24 న్యూస్ రిపోర్టర్ నల్ల రాజిరెడ్డి తల్లి నల్ల పుల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పొన్నం యువసేన తంగేళ్లపల్లి రమేష్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం కింద 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. తంగేళ్ల పెల్లి రమేష్ మాట్లాడుతూ మండలంలో ఏ ఒక్కరికి ఆపద వచ్చిన సమయంలో ముందుండి కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు నా వంతు గా ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి : కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ, మే 10 :** భారత్ – పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణకు వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కారుకి సరికొత్త ప్రతిపాదనలు చేసింది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. దీంతోపాటు ప్రధాని అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతోంది. భారత్, పాకిస్తాన్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించడంతో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిల పక్ష సమావేశానికి అధ్యక్షత వహించి రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిన అవసరం ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా ఉందని కాంగ్రెస్ ఈ (శనివారం) సాయంత్రం ఒక ప్రకటనలో కోరింది. గత 18 రోజుల ఘటనలను చర్చించడానికి ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష పార్టీ కూడా అయిన కాంగ్రెస్ డిమాండ్ చేసింది. “వాషింగ్టన్ డిసి నుండి అపూర్వమైన స్టేట్ మెంట్ దృష్ట్యా, ప్రధానమంత్రి అఖిల పక్ష సమావేశానికి అధ్యక్షత వహించి రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిన అవసరం ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా ఉంది” అని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ సెక్రటరీ జైరాం రమేష్ (గతంలో ట్విట్టర్)లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. క్రూరమైన పహల్గాం ఉగ్రవాద దాడితో ప్రారంభమైన గత 18 రోజుల ఘటనలు, ఇక మీదట భారత్ ముందుకు సాగే మార్గాన్ని చర్చించడానికి, దేశపు సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం అవసరం ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా ఉందని రమేష్ అన్నారు. అమెరికా మధ్యవర్తిత్వం వహించిన తర్వాత భారత్, పాకిస్తాన్ “పూర్తి, తక్షణ” కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే కాంగ్రెస్ పార్టీ ఈ సంక్షిప్త ప్రకటన చేసింది. కాగా, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో.. ఇరు దేశాల ప్రధానమంత్రులు, మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇంకా, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌లతో మాట్లాడిన తర్వాత భారత్, పాక్ కాల్పులు ఆపేస్తున్నారంటూ ట్రంప్ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే.

# ఫలించిన భారత్ వ్యూహం..

## పాక్ కాళ్ల బేరానికి రావడానికి కారణం ఇదేనా

**న్యూఢిల్లీ, మే 10 :** యుద్ధం తప్పదని అనుకుంటున్న తరుణంలో భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అసలు తెర వెనుక ఏం జరిగిందీ అనేదే ఇప్పుడు అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న ఇది. భారత దాడులతో పాక్ వణికిపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. యుద్ధ భయాలతో పాక్ దివాళ అంచుకు చేరుకుంది. నిత్యావసరాల కొరతతో చివరకు పెట్రోల్ బంకులు కూడా మూసేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే, పాక్ కాళ్ల బేరానికి రావడం వెనక భారత్ దౌత్యపరంగా తీసుకొచ్చిన ఒత్తిడి కూడా ఓ ప్రధాన కారణమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అడుక్కుతినే స్థితిలో ఉన్న పాక్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి మంజూరు చేసిన రుణం దక్కే పరిస్థితి లేకపోవడంతో పాక్ దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని చెబుతన్నారు. కాల్పుల విరమణ కోసం పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ భారత్‌కు ఫోన్ చేసిన విషయం తెలిసిందే. రాత్రంతా ఇరు దేశాలతో తెగ చర్చలు జరిపి రాజీ కుదిర్చినట్టు డొనాల్ట్ ట్రంప్ తెలిపారు. ఇక చేతిలో చిల్లిగవ్వ లేక భికారిగా మారిన పాక్‌కు ఇటీవలే 1 బిలియన్ డాలర్ల ఐఎమ్ఎఫ్ లోన్ కూడా మంజూరైంది. ఈ లోన్ జారీపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ డబ్బుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని హెచ్చరించింది. దౌత్యపరంగా తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ స్థితిలో లోన్ మంజూర్ కావడంతో ఐఎమ్ఎఫ్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణకు, లోన్



నిధుల విడుదలకు లింక్ పెట్టారట. లోన్‌లో పైసా కళ్ల చూడాలన్నా తక్షణం కాల్పుల విరమణకు అంగీకరించాలని ట్రంప్ తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. ఐఎమ్ఎఫ్ బోర్డులో అమెరికా కీలక సభ్య దేశం. అమెరికా అనుమతి లేనిదే పాక్ బొచ్చెలో పైసా కూడా పడదు. దీంతో, దిక్కుతోచని స్థితిలో పడిపోయిన పాక్ చివరకు కాళ్లబేరానికి వచ్చి భారత్ ముందు కాల్పుల ఒప్పందం ప్రస్తావన తెచ్చిందట.

# పాక్ వద్ద ఉన్న మిసైల్స్ ఇవే.. వీటి సామర్థ్యం ఎంతంటే..

**న్యూఢిల్లీ, మే 10 :**
తినడానికి తిండి గింజలు లేని పాకిస్థాన్ యుద్ధోన్మాదంతో రెచ్చిపోతోంది. భారత్‌ను అదే పనిగా కవ్విస్తోంది. ఈ చర్యలకు దాయాది దేశం తగిన ఫలితం మూటగట్టుకోక తప్పదు. ఇప్పటికే భారత్ పాక్ దేశ స్థావరాలపై భారీ దాడులు చేసి పలు టెర్రరిస్టులను అంతమొందించింది. పాక్ ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్స్‌ను కూడా గాల్లోనే పేల్చిపారేసింది. ఈ నేపథ్యంలో అసలు పాక్ వద్ద ఉన్న ముఖ్య మిసైళ్లు ఏవో చూద్దాం. పాక్ ఇటీవలే 450 కిలోమీటర్ల రేంజ్ బాలిస్టిక్ మిసైల్ అబ్దాలీని ఇటీవలే పరీక్షించింది. దీనితో పాటు అనేక ఇతర మిసైళ్లు పాక్ వద్ద ఉన్నాయి. దాయాది వద్ద ఉన్న హఫ్త్–1 షార్ట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్.. 70–100 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. సంప్రదాయ వార్ హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. హఫ్త్–2 (అబ్దాలీ) 180 నుంచి 200 కిలోమీటర్ల రేంజ్‌ను టార్గెట్ చేయగలదు. ఇది రకరకాల వార్ హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. హఫ్త్–3 (ఘజ్నవీ) మిసైల్ రేంజ్ 300 కిలోమీటర్లు. దీనికి అణువార్ హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం కూడా ఉంది. ఇక హఫ్త్–4 (షాహీన్–1) షార్ట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్.. 750 నుంచి 900 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణు, రసాయనిక వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం దీని సొంతం. ఇక మధ్య శ్రేణి ఘౌరీ మిసైల్ 1250 నుంచి 1500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణు వార్ హెడ్స్ ప్రయోగించేందుకు వీటిని పాక్ ఉపయోగించొచ్చు. షాహీన్ –2 కూడా మధ్యశ్రేణి బాలిస్టిక్ మిసైల్. దీని




రేంజ్ గరిష్ఠంగా 2 వేల కిలోమీటర్లు. అణు, రసాయన వార్ హెడ్స్ మోసుకెళ్లగలదు. సబ్ సానిక్ క్రూయిజ్ మిసైల్ బాబర్.. 350 నుంచి 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. హఫ్త్ నసర్ అనే స్వల్ప శ్రేణి మిసైల్‌కు అణుసామర్థ్యం ఉంది. దీని రేంజ్ 70 కిలోమీటర్లు. షాహీన్ –3 మధ్య శ్రేణి మిసైల్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. దీని రేంజ్ 2750కిలోమీటర్లు. నేవీ షిప్‌లను ధ్వంసం చేసేందుకు ఉద్దేశించిన ఎక్సోసెట్ క్షిపణి సామర్థ్యం 40 నుంచి 180 కిలోమీటర్లు. అణుసామర్థ్యం కలిగిన మధ్య శ్రేణి క్షిపణి అబాదిల్ ప్రస్తుతం అభివద్ధి దశలోనే ఉంది.

# వివాహితకు వేధింపులు.. ఆర్‌ఎస్‌ఐపై కేసు నమోదు




**తిరుపతి, మే 10:** మహిళను వేధిస్తుండటంతో రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్ ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్‌పై అలిపిరి పోలీసులు ఇవాళ(శనివారం) కేసు నమోదు చేశారు. మూడేళ్లుగా వేధింపులకు గురిచేస్తూ... కాపురంలో గొడవలు పెడుతున్న విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. విశ్వనాథ్ చెప్పినట్లుగా వినకపోతే తన భర్తను చంపేస్తానని ఫోన్‌లో బెదిరింపులకు దిగాడని బాధితురాలు పేర్కొంది. జనవరిలో స్నేహితులతో కలసి తన భర్తపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో ఆమె ప్రస్తావించింది. వేధింపులతో పాటు ఆర్‌ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆయనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. స్మగ్లర్ విజయానందరెడ్డి అండదండలతో టాస్క్‌ఫోర్స్‌లో విశ్వనాథ్ పోస్టు దక్కించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. 2022లో తనను ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ వేధిస్తున్నారని అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మూడేళ్లుగా తన కుటుంబాన్ని ఆర్‌ఎస్‌ఐ వేధిస్తున్నారని బాధితురాలు తెలిపింది. తన మొబైల్‌కు అసభ్యకరమైన వీడియోలను ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ పంపించారని ఫిర్యాదులో పేర్కొంది. తట్టుకోలేని బాధితురాలి భర్త ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్‌కి దేహశుద్ధి చేశాడు. వివాహిత ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. బాధితురాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

## 'నా సిందూరాన్ని దేశ రక్షణ కోసం

# పంపుతున్నా'.. నవవధువు



**మహారాష్ట్ర, మే 10 :**
పెళ్లయి 3 రోజులు కూడా కాలేదు. దేశరక్షణ కోసం అర్జంటుగా విధుల్లో చేరాలని భారత ఆర్మీ నుంచి భర్తకు పిలుపు. ఆ నవవధువు స్థానంలో ఇంకెవరైనా ఉంటే ఎలా స్పందించేవారో తెలీదు కానీ.. ఆమె మాత్రం ధైర్యం కోల్పోలేదు. వ్యక్తిగత జీవితం కంటే దేశ రక్షణే మిన్న అనుకుంది. సరిహద్దుల్లో వీరోచితంగా పోరాడి విజయంతో తిరిగి రమ్మని భర్తకు ధైర్యాన్ని నూరిపోసింది. రైల్వే స్టేషన్లో కుటుంబ సభ్యులంతా బాధను గుండెల్లో నింపుకుని సాగనంపుతుంటే.. దేశసేవ కోసం నా సిందూరాన్ని పంపుతున్నా అంటున్న కొత్త పెళ్లికూతురు వీడియో ఇప్పుడు ఇంటర్నెట్లో తెగ వైరలవుతోంది.

**పెళ్లైన 3 రోజులకే..**

మహారాష్ట్ర జల్గావ్‌లోని పచోరా తాలూకాలోని పుంగావ్‌కు చెందిన జవాన్ మనోజ్ జ్ఞానేశ్వర్ పాటిల్‌కు, అదే తాలూకాలోని కలాంసర గ్రామానికి చెందిన యామినికి మే 5న వివాహమైంది. అయితే, భారత్–పాక్ మధ్య సరిహద్దుల వద్ద ఉద్రిక్తలు పెరుగుతుండటంతో వెంటనే సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలని మనోజ్ కు పై అధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. దీంతో అతడు మే 8న డ్యూటీకి బయలుదేరాడు. అతడికి పచోరా రైల్వే స్టేషన్లో వీడ్కోలు పలికేందుకు భార్య, కుటుంబ సభ్యులు అక్కడకు చేరారు. ఆ సమయంలో అందరి మధ్య ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంది. కలల జీవితం ఆస్వాదించాలనే ఆశలను, బాధను దిగమింగుకుని.. దేశాన్ని రక్షించడానికి నా సింధూరాన్ని పంపుతున్నానంటూ భర్తకు వీడ్కోలు పలికింది యామిని. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నవవధువు ధైర్యానికి నెటిజన్లు హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

# ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకో..

## జగన్‌పై లోకేష్ ఫైర్



**అమరావతి, మే 10:** ప్రభుత్వ సొమ్ముతో కుట్టుమిషన్లను కొని పసుపు రంగు వేసి అందిస్తున్నారంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేష్ ఫైర్ అయ్యారు. ఫేక్ పార్టీ వైసీపీకి మంత్రి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వైసీపీ హయాంలో జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. జనం సొమ్మును కాజేయాలనే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా లేని సమయంలో కూడా మంగళగిరి ప్రజలకు స్వయం ఉపాధికి ఆర్థిక సాయంతో చేయూతనందించానని.. అందంతా తన సొంత నిధులతో చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇకనైన ఫేక్ ప్రచారాలు మానుకో అంటూ జగన్‌పై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**లోకేష్ ట్వీట్ ఇదే..**

'జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రజలని గాలికి వదిలేసి, జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అప్పుడు నేను ఎమ్మెల్యేనీ కూడా కాను. ప్రజల కోసమే పుట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, నా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు స్వయం ఉపాధికి చేయూతనందించాలని నిర్ణయించుకున్నాను. మహిళలు, చేనేతలు, స్వర్ణకారులు, చిరువ్యాపారులకు అవసరమైన సామాగ్రి, ఆర్థిక సాయంతో చేయూతనందించాను. వీటన్నింటికీ నా సొంత నిధులు వెచ్చించాను. కుల, మత అంతరాలు పాటించకుండా... తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే మహిళామణులు వేలాది మందికి స్త్రీశక్తి పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చాము. ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్లు, ఉచితంగా టైలరింగ్ మిషన్, మెటీరియల్ అందజేశాను' అని చెప్పుకొచ్చారు. మంగళగిరి స్త్రీ శక్తి కేంద్రం 2022,జూన్20న ప్రారంభించాం. ఈ కేంద్రం ఇప్పటి వరకూ 43 బ్యాచుల్లో 2226 మంది శిక్షణ పూర్ తిచేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశాం. తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023, ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచుల్లో శిక్షణ తీసుకున్న 666 మందికి మిషన్లు ఉచితంగా ఇచ్చాం. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచుల్లో 616 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు పంపిణీ చేశాం. ఇప్పటి వరకూ 3508 మందికి శిక్షణ పూర్ తిచేసి, ఉచితంగా నాణ్యమైన కుట్టు మిషన్లు అందజేశాం. ఇవన్నీ నా జేబులోంచి తీసిన డబ్బులు, నా ఖాతాల నుంచి వెచ్చించిన సొమ్ములు కాబట్టే...శుభానికి సంకేతమైన నా పార్టీ పసుపు రంగు మిషన్లు ఇచ్చాను.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101